ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

- నేడు మండలాల్లో ప్రదానం
- జిల్లాకు 243 అవార్డులు


ఏటూరునాగారం గ్రామ పంచాయతీ భవనం

ఏటూరునాగారం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు గ్రామ పంచాయతీ ద్వారా సుభిక్షమైన పాలన, అభివృద్ధి, సేవా ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న పంచాయతీలకు అవార్డులను కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ద్వారా అందించనుంది. జిల్లాలో 9 మండలాలు, 174 పంచాయతీలు ఉండగా 243 అవార్డులను సర్పంచ్‌లకు ఇవ్వనున్నారు. ఒక్కో పంచాయతీకి ఒకటి లేదా మూడు లేదా అంతకంటే ఎక్కువ కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది జనవరిలో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సూచనల ప్రకారం ప్రభుత్వం జాతీయ అవార్డుల కోసం పనిచేస్తున్న గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు.

పంచాయితీ అవార్డులు 2023లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుగా తొమ్మిది విభాగాలుగా ఎంపిక చేశారు. మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అవార్డులు కూడా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల వారీగా వారి సేవలను సర్వేచేసి నేషనల్ పంచాయతీ పోర్టల్(ఎన్‌పీఏ) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో ఆ సేవలను ఆధారంగా స్కోర్‌ను ఇచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒకటి, రెండు, మూడు దశల్లో అవార్డులు ఇవ్వనున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల వివరాలను సేకరించి వాటి ద్వారా అమలవుతున్న పథకాలను ఎన్‌పీఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ప్రక్రియ రెండు నెలల పాటు కొనసాగింది. జిల్లాలో ఈనెల 24న మెరుగైన సేవలు, పాలన అందించిన పంచాయతీలకు అవార్డులు ఇచ్చేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీలను 9 విభాగాలుగా గుర్తించి అందులో నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో అవార్డులను అందించనున్నారు. 9 విభాగాల్లో నాలుగైదు విభాగాలు ఒకే గ్రామంలో ఉండవచ్చు.. లేదా మూడు విభాగాలు ఉండవచ్చు.. అంతకంటే ఎక్కువ ఉన్నా కూడా అవార్డులను అందించనున్నారు.

9 విభాగాలుగా గుర్తింపు

- పేదరికం లేనిది, జీవనోపాధిని మెరుగుపర్చిన పంచాయతీ
- ఆరోగ్యకరమైన పంచాయతీ
- స్నేహపూర్వకమైన పిల్లలు మెరుగ్గా ఉన్న పంచాయతీ
- నీటి కొరత లేకుండా లభ్యత తగినంత ఉన్న గ్రామ పంచాయతీ
- పచ్చదనం పరిశుభ్రత కలిగి ఉండడం
- స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు కలిగిన పంచాయతీ
- సామాజికంగా సురక్షితంగా ఉన్న పంచాయతీ
- సమన్వయం సురక్షితమైన పాలన కలిగిన పంచాయతీ
- మహిళల అభివృద్ధి స్నేహపూర్వకంగా మెలిగే పంచాయతీ

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా..



గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేయిస్తున్నాం. అవార్డులు వచ్చే విధంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు అంకితభావంతో పనిచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి మరింత అభివృద్ధి దిశగా గ్రామాలను నడిపిస్తాం.

– వెంకయ్య, డీపీఓ

సమన్వయంతో ముందుకు..



గ్రామ పంచాయతీ పరిధిలోనిని వార్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్నాం. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తీర్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడటమే మా లక్ష్యం.

– ఈసం రామ్మూర్తి, ఏటూరునాగారం సర్పంచ్

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం..


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు: దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్ టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అన్న తిరుపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో బ్రిటీష్ వారికి ముచ్చెమటలు పట్టించిన భగత్‌సింగ్ త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బద్దుల లక్ష్మీ, ములుగు మండల అధ్యక్షుడు కొండబోయిన దిలీప్, వెంకటాపురం(ఎం) మండల అధ్యక్షుడు బల్ల ప్రతాప్, యూత్ అధ్యక్షుడు చేను నరేశ్, నాయకులు పావురాల భిక్షపతి, ఎండీ అబ్బాస్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న బ్యాగు అందజేత



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన హిమబిందు అనే మహిళ గురువారం భూపాలపల్లి నుంచి రాంనగర్‌కు వెళ్తున్న క్రమంలో ఆటోలో బ్యాగు మరిచిపోయింది. ఈ విషయం సంతలో విధులు నిర్వహిస్తున్న పెట్రోకార్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు తెలిపింది. వెంటనే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆట్టి ఆటోను కనిపెట్టి బాధితురాలికి బ్యాగు అందజేశా డు. అందులో పదివేల రూపాయలు, ఇతర సా మగ్రి ఉన్నాయి. ఈ సందర్భంగా హిమబిందు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. తక్షణమే స్పందించి ఆటోలో మర్చిపోయిన బ్యాగును కనిపెట్టి అందించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులతో పాటు పట్టణ ప్రజలు అభినందించారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

భూపాలపల్లి రూరల్: గంజాయి విక్రయదారులను అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సమయంలో బాంబుల గడ్డ జాతీయ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి అభ్యమైట్లు తెలిపారు. అందులో కాటారానికి చెందిన సోనారి వెంకటేష్, మహాముత్తారానికి చెందిన బౌత్ ఆకాశ్ ఇద్దరు ప్రస్తుతం జవహర్ నగర్ భూపాలపల్లిలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ ఇద్దరు మహదేవపూర్ గ్రామానికి చెందిన సుల్తాన్ రాకేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి భూపాలపల్లిలో అవసరం ఉన్నవారికి ఎక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు. ఈ క్రమంలో బాంబుల గడ్డ వద్ద సుల్తాన్ రాకేష్ వద్ద గంజాయి తీసుకుని వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు వెల్లడించారు.

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు

మహదేవపూర్: మండలంలో రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ద్వారా సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయకపోవడంతో బ్యాంకింగ్ రంగం, ప్రభుత్వ కార్యాలయాలు, బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై ఆ సంస్థ జేఈ మాహంతిని వివరణ కోరగా కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ వద్ద బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో అగ్నిప్రమాదం జరగడం వల్ల సేవలు నిలిచిపోయాయని తెలిపారు. త్వరలోనే పునరుద్ధరిస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ జట్టులో కాటారం గిరిజన సంక్షేమ కళాశాల హ్యాండ్ బాల్ అకాడమీ విద్యార్థులు జితేందర్, అశోక్ ఉన్నారు. ఈ నెల 27 నుంచి అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగబోయే జాతీయ స్థాయి బాలుర సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ జట్టు తరుపున వారు ఇద్దరు పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు కళాశాల విద్యార్థులు ఎంపికవడంపై ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్, తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తిరుపతి రావు

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై తిరుపతిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముకునూరు పాలెం గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామంలోనికి ఎవరైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. గ్రామంలో ఎమైన గొడవలు జరిగితే గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ రంగాల్లో కావాల్సిన సహాయం అందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం


ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని గోదావరి ఇసుక పాయ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. తహసీల్దార్ అంటి నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి ఇసుక పాయ నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఆర్ఐ మల్లేషం, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ములుగు రూరల్: అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాలిన మామిడి కాయలను తీసుకు వచ్చి రైతులతో కలిసి జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కృష్ణా ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవిందరావుపేట మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు మామిడి తోటలు, వరి , మిర్చి పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని అన్నారు. సమారు మండలంలో 300 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని అన్నారు. వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులతో పంటల సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు గఫూర్, తీగ ఆదిరెడ్డి, చంద్రారెడ్డి, అమ్జద్‌పాషా, బాలు, రాజు, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అనితారాణి

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని జంగాలపల్లి సర్పంచ్ మస్రగాని అనితారాణి అన్నారు. గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని విధాల సౌకర్యాలు కల్పించామని అన్నారు. గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నవ్యరాణి, ఆప్తామాలిక్ వినయ్, డీఈఓ మమత, హెల్త్ సూపర్‌వైజర్ ఉష, ఏఎన్ఎంలు రమ, సావిత్రి, ఆశ వర్కర్లు మంజుల, పూలమ్మ, మమత, ఆదిలక్ష్మీ, నాయకులు మోహన్, శ్రీధర్, చిట్టిబాబు, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ములుగు: నూతనంగా ములుగు ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న పవన్‌కుమార్‌ను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్‌ల ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు కంబాల రవి, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, మట్టెవాడ తిరుపతి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్‌యాదవ్, నూనేటి శ్యాం, నల్లెల భరత్‌కుమార్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక చట్టాలను ఖండించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

ములుగు రూరల్(గోవిందరావుపేట): కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న ప్రజావ్యతిరేక చట్టాలను ఖండించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య అన్నారు. గురువారం గోవిందరావుపేట మండలంలోని పస్రాలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ అధికారంలో వచ్చిన 8 సంవత్సరాలలో కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తీసుకువచ్చి ఇబ్బందులు పెడుతుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గిస్తూ ప్రజలను పనికి దూరం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలోతొక్కే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, పోషాలు, చిన్న, రాంబాబు, కోటయ్య, హర్షవర్ధన్, మహేందర్, రాజేశ్వరి, శారద, సీతారామరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మొగుళ్లపల్లి: అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ

మొగుళ్లపల్లి: పౌష్టికాహారంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని సీడీపీఓ అవంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాల్గొవ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ప్రతిరోజు భోజనం చేయలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మారావు, సూపర్‌వైజర్ రజిత, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు వెన్నెల పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్‌లు బిల్లకంటి ఉమేందర్‌రావు ఆధ్వర్యంలో గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ మాట్లాడుతూ చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమని అన్నారు.

సన్మానం


అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

ములుగు రూరల్: కాకతీయ యూనివర్సిటీలో అర్థశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన గిరిజన బిడ్డ భూక్యా అమర్‌సింగ్‌ను కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కష్టపడి చదివి డాక్టరేట్ పొందిన అమర్‌సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, అజారుద్దీన్, రాజాహుస్సేన్, భాస్కర్, రఘు, ప్రభాకర్, అశోక్, సంతోష్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలి


మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి: తీన్మార్ మల్లన్నను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకను అరెస్టు చేయడం హేయనీయమైన చర్య అన్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియపరుస్తున్న మల్లన్నను కుట్ర పూరితంగా ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. మల్లన్న అరెస్టు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఇర్ప సునిల్, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగదీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూషనబోయిన రవికుమార్, నాయకులు పిట్టల మహేందర్, మల్లేష్, పోశాలు, కొండల్, నర్సయ్య, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించండి

మహదేవపూర్: మండలంలోని రైతులు పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ చల్లా తిరుపతి అన్నారు. గురువారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ప్రస్తుత సంవత్సరం ఆర్జించిన లావాదేవీల గురించి చర్చించి తీర్మానం చేశారు. సంఘం ప్రస్తుత సంవత్సరము సుమారు రూ.43 లక్షల వార్షిక ఆదాయం గడించినట్లు వెల్ల డించారు. ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణ, మహదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపు, కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత, కార్యవర్గ సభ్యులు ఇబ్రహీంఖాన్, సుధాకర్, సవిత, తిరుపతి పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, ధర్మకర్తలు దేవేందర్, సమ్మయ్య, సిద్ధాంతి భాను ప్రకాష్‌లను తదితరులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదరణను చూసి ఓర్వలేకనే కేసులు

టేకుమట్ల(రేగొండ): రాహుల్‌గాంధీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే నరేంద్రమోదీ అక్రమ కేసులు పెడుతున్నాడని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. గురువారం రేగొండ మండలంలోని రాయపర్తి, కనిపర్తి, నాగుర్లపల్లి, రాజక్కపల్లి, విజ్జయ్యపల్లి, బాలయ్యపల్లి, చిన్నకోడెపాక, దమ్మన్నపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. బాలయ్యపల్లిలో రాహుల్‌గాంధీ అరెస్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019లో కర్ణాటక లోక్‌సభ ఎన్నికల రాహుల్ గాంధీపై బీజేపీ పరువునష్టం దావా వేశారన్నారు. ఈ క్రమంలో రాజకీయ కుట్రతోనే రాహుల్ అరెస్టుకు తీర్పునిచ్చారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూటోజు కిష్టయ్య, కనకం రమేష్, పత్తి తిరుపతి, బానోతు రవిందర్, కిరణ్, వీరేందర్, జోరు సుధర్శన్, వీరబ్రహ్మం, గండి తిరుపతి, రవి, బిక్షపతి, సదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


భూపాలపల్లి రూరల్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


రేగొండ మండలం బాలయ్యపల్లిలో..

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే సూరత్ కోర్టు నుంచి రాహుల్‌గాంధీ అరెస్టుకు తీర్పునిచ్చారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆరోపించాడు. రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని కోరుతూ.. కాంగ్రెస్ శ్రేణులు గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం దేవన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజాక్షేత్రంలో బీజేపీ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ దేశ సమగ్రత కోసం పార్టీ పోరాడుతుందన్నారు. రాహుల్ గాంధీ దేశాన్ని ఏకం చేయడం కోసం భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. జోడోయాత్ర ద్వారా ప్రజలలో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూనమల్ల రాజన్న, రాజేష్, బొడ్డు అశోక్, చల్లూరి సారయ్య, నగునూరి రజినీకాంత్ గౌడ్, సుభాష్, ఉస్మాన్, మహేష్, శనిగరపు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు అప్‌డేట్ తప్పనిసరి


అప్‌డేట్ పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్

చిట్యాల: మండలంలో 2016కు ముందు ఆధార్ కార్డు పొందిన ప్రజలు వెంటనే అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ సరికొమ్ముల సమ్మయ్య కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్‌కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందడానికి ఆధార్ కార్డును తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవలసిన అవసరం ఉందన్నారు.